నీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించండి

రాజంపేట టౌన్ : వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు మండలాధ్యక్షుడు (ఎంపీపీ) వెంకటనారాయణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గురువారం ఎంపీడీఓ పగడాల వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. అధికారులు ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. ఎంపీడీఓ వరప్రసాద్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలపై అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉందని, అందువల్ల దోమలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పంటల సాగులో ఎప్పటికప్పుడు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అలాగే పశువైద్య సిబ్బంది మూగజీవాలు జబ్బుల బారీన పడకుండా ఆయా సమయాల్లో టీకాలను వేస్తుండాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తన పరిధిలో లేని సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆలస్యం లేకుండా ప్రజాసమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. గత ఏడాది వేసవిలో నీటిఎద్దడి తలెత్తిన గ్రామాల్లో ఈ ఏడాది అలాంటి సమస్య లేకుండా ఒక ప్రణాళికాబద్ధంగా నీటిఎద్దడి సమస్యను అధిగమించాలని తెలిపారు. ఇదిలావుంటే వివిధ శాఖల అధికారులు వారిశాఖల ప్రగతిని వివరించారు.


మండల సర్వసభ్య సమావేశానికి బందోబస్తుగా ఉన్న పోలీసులు

బందోబస్తుపై పెదవి విరిచిన ప్రజాప్రతినిధులు

ఇదిలావుంటే మండల సర్వసభ్య సమావేశానికి గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు, వాతావరణం లేకపోయినప్పటికీ పోలీసు బందోబస్తు మధ్య మండల సమావేశాన్ని నిర్వహించడంతో పలువురు కూటమి పార్టీ నాయకుల తీరుపై పెదవి విరిచారు. రాజంపేటలో ఎప్పుడు ప్రశాంత వాతావరణం ఉంటుందని, అలాంటి రాజంపేటలో కూటమి నాయకుల వల్ల ప్రశాంత వాతావరణం కలుషితమయ్యే ప్రమాదముందని మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన పలువురు ప్రజాప్రతినిధులు తమ సంభాషణల మధ్య ఆందోళన వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనారాయణ, పక్కన ఎంపీడీఓ వరప్రసాద్

విద్యార్థులకు సౌకర్యాలు అందించాలి


పాఠశాల తనిఖీ అనంతరం బాలికలతో మాట్లాడుతున్న జడ్జి తేజసాయి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని అంబేడ్కర్ నగర్ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని గురువారం కోడూరు సివిల్ కోర్టు న్యాయమూర్తి తేజసాయి పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాలలో భోజనాలు, వసతులు గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం సౌకర్యాలు అందించాలని ఆయన ఆదేశించారు. చదువుకుంటున్న విద్యార్థినులకు ఏ ఇబ్బందులు కలిగినా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదులుంటే తమకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారికి సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్‌ల నాయకురాళ్లు విన్నవించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా ఐసీడీఎస్‌కు సంబంధించిన రివ్యూ సమావేశానికి హాజరైన ఆమెను వారు కలుసుకుని మాట్లాడారు. అన్నమయ్య జిల్లాలో ఐసీడీఎస్‌లో ఉద్యోగాల భర్తీకి ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అవకతవకలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా హెల్పర్లకు ప్రమోషన్‌ల కల్పించని నోటిఫికేషన్‌ను వెంటనే రద్దుచేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలంటూ కోరారు. రెండు నెలలుగా జీతాలు అందడం లేదని, 3 సంవత్సరాలుగా సీబీ ఈవెంట్స్ ఇవ్వలేదన్నారు. రాయచోటి అర్బన్ ఏరియాలో పెరిగిన అద్దెలను గత 7 నెలలుగా చెల్లించలేదన్నారు. మొబైల్ క్లారిటీ లేనందున నోట్ కెమెరాను రద్దుచేయాలని, స్టాక్ సకాలంలో పంపిణీ చేయకుండా ఎఫ్ఆర్ఎస్ చేయమనడం సరైంది కాదన్నారు. రాజకీయ కక్షలతో హోల్డ్‌లో పెట్టిన హెల్పర్స్‌ను వెంటనే విధులలోకి తీసుకోవాలని, సమ్మె హామీలలో భాగంగా వెంటనే వేతనాలను పెంచాలన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం గ్రాట్యుటీని ఇవ్వాలని, బిల్లులు, జీతాలను సకాలంలో చెల్లించాలంటూ కోరారు. అనంతరం ఈ మేరకు యూనియన్ నాయకురాళ్లు వేర్వేరుగా ఆమెకు వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు శ్రీలక్ష్మి, రాజేశ్వరి, బంగారు పాప, భాగ్యలక్ష్మి, మధుర వాణి, సిద్దమ్మ, ఓబులమ్మ, సరోజమ్మ, భారతి, రామతులసి, రెడ్డెమ్మ, సుజాత, రజనీతో పాటు పెద్దఎత్తున అంగన్ వాడీలు పాల్గొన్నారు.


ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారికి సమస్యలను విన్నవిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజల తాగునీటి ఇబ్బందులు పట్టవా?

నందలూరు : ప్రజలకు మంచి నీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణ దేవరలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పాటూరు పంచాయతీ వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీని వారు సందర్శించారు. కాలనీలో నెలకొన్న నీటి సమస్యను స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. చాలా రోజుల నుంచి నీటి సమస్య ఉన్నా పరిష్కరించడం లేదని గ్రామస్తులు తెలిపినట్టు సీపీఐ నాయకులు చెప్పారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలన గాడితప్పిందన్నారు. గ్రామాల్లో నీటి కష్టాలు ఉన్నా నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎస్టీ కాలనీలో తాగేందుకు నీరు అందక ప్రజలు వ్యవసాయ పొలాల బాట పడుతున్నారన్నారు. అనంతరం కాలనీలో సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో మహిళలు, గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అధికారులు త్వరితగతిన సమస్య పరిష్కరించడమే కాక నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. లేకుంటే మండల కేంద్రంలోని మండలాధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌ను తొలగించడాన్ని తప్పుబట్టారు, యాజమాన్యం వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రైల్వేకోడూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గోశాల దేవి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ ఎస్.శాంతయ్యలు డిమాండ్ చేశారు. గురువారం ఏపీఎండీసీ పాఠశాల ఎదురుగా తొలగించిన ఉద్యోగస్తులు రిలే నిరాహార దీక్షకు వారు మద్దతు పలికి మాట్లాడారు. అధికార కూటమి పక్షాలకు చెందిన వారిని ఏపీఎండీసీలో తీసుకోవడానికే మూడేళ్లగా పని చేస్తున్న సిబ్బందిని తొలగించడం అన్యాయమన్నారు. ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా తమ వారికి పోస్టులు కట్టబెట్టేందుకు చేసిన దిగజారుడు చర్యలను వారు ఖండించారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమిస్తామని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. అలానే సీఐటీయూ నాయకులు దీక్షకు మద్దతు పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్, రైల్వేకోడూరు యూత్ కాంగ్రెస్ నాయకులు నన్నం శివకృష్ణ, పుల్లంపేట యూత్ నాయకులు అజిత్, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.


ఉద్యోగస్తులకు మద్దతుగా దీక్షలో కాంగ్రెస్ నేతలు

గృహ హింస చట్టంపై అవగాహన అవసరం

పెనగలూరు : గృహ హింస చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ అమరేశ్వరీ, ఎంపీడీఓ విజయారావులు తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ భవనంలో మహిళలతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో మహిళలు అవమానకర సంఘటనలను ఎదుర్కొంటే వాటిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. కుటుంబ సమస్యలు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని, కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. పరిష్కారం కాని పక్షంలో కేసు నమోదు చేసి కోర్టుకు పంపుతామని చెప్పారు. అంతకుముందు తహసీల్దార్ అమరేశ్వరీ, ఎంపీడీఓ విజయారావులు మాట్లాడుతూ వివాహితలను అత్తింటి వారు వేధిస్తుంటే ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలసిన చింతరాజుపల్లె గ్రామస్తులు

ఒంటిమిట్ట : వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చింతరాజుపల్లి గ్రామ సమస్యలను తెలియజేసినట్టు వీపీఎస్ మాజీ ప్రెసిడెంట్ అబ్బన్నగారి రాజశేఖర్ రాయల్ చెప్పారు. గురువారం బుధవారం ఒంటిమిట్ట మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామానికి విచ్చేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిలను రాజశేఖర్ గ్రామస్తులతో మర్యాద పూర్వకంగా కలసి గ్రామ సమస్యలను వివరించారు. మారుమూల గ్రామం కావడంతో అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, సమస్యల నిలయంగా గ్రామం తయారైందని అధికారులకు చెప్పుకుందామన్న సచివాలయంలో సిబ్బంది కూడా లేరని తెలియజేశారు. మా సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదన్నారు. తమ సమస్యలను రాష్ట్ర స్థాయి అధికారులకు తెలియజేసి పరిష్కరించేందుకు కృషి చేయాలని విన్నవించారు. సమస్యలపై పెద్దిరెడ్డి సానుకూలంగా స్పందించినట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, చింతరాజుపల్లి యూత్ లీడర్‌లు రాసాల జయచంద్ర, రాసాల కదిరి ప్రసాద్, మల్లారెడ్డి, రవికుమార్ రెడ్డి, ఇరగంరెడ్డి శ్రీకర్ రెడ్డి, నాగార్జున, జంగాల శివశంకర్‌లు పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు

రాజంపేట : మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్ అన్నారు. కడప – రేణిగుంట జాతీయ రహదారిలోని ఎంవీఐ కార్యాలయం(ఎర్రబల్లి) క్యాంపస్‌లో రాజంపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 150మందికి పైగా డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల విషయంలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముందుగా డ్రైవర్లు ఆరోగ్యకరంగా ఉండేలా ముందుస్తుగా ఆరోగ్య జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవర్లకు కంటిచూపు చాలముఖ్యమన్నారు. కంటిచూపు లోపం లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు భద్రతా చర్యలను తీసుకోవాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా వాహనాలను రోడ్డుపై నడపాలన్నారు. జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తుంటే, అందుకు సహకారంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించామన్నారు. కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. డ్రైవర్ల చూపు బాగుంటే రోడ్డుపై డ్రైవింగ్‌తో అందరు బాగుంటారన్నారు. ఆకేపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి అశ్వినికుమార్, ఆప్తమాలజిస్టు చంద్రశేఖర్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు నిండిన ప్రతి డ్రైవర్ ప్రతి సంవత్సరం కంటి పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీరమణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు, న్యాయవాది టి.లక్ష్మినారాయణ, సుబ్రమణ్యంరాజు, కె.ఎస్.నరసింహ, చంద్రనాయుడుతోపాటు పలువురు డ్రైవర్లు, లయన్స్‌క్లబ్ సభ్యులు, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కంటి వైద్య పరీక్షల్లో పాల్గొన్న డ్రైవర్లు

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలి

వీరబల్లి : ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిపేందుకు సామాజిక తనిఖీ ఉపయోగపడుతుందని ఉపాధి పీడీ వెంకటరత్నం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ వెంకటరత్నం మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. పనుల నాణ్యతగా చేపట్టాలంటూ సూచించారు. అనంతరం సామాజిక తనిఖీ నివేదికను చదివి వినిపించారు. మొత్తం రూ.10,53,92,957ల పనులు జరిగాయన్నారు. ఇందులో రూ. 97,360లను రికవరీ చేయగా మరో రూ.3 లక్షలను రికవరీ చేయాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఓ నాగరాజు, హౌసింగ్ ఏఈ వెంకటేష్, వీసీ ఆంజనేయులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా అధికారులు

డబుల్ రోడ్డు పనులు వెంటనే చేపట్టండి

సుండుపల్లె : రాయచోటి నుంచి పింఛా వరకు సుండుపల్లె మీదుగా వెళ్లే మార్గంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని రాష్ట్ర బంజారా సంఘం జాతీయ అధ్యక్షుడు నాగేంద్ర నాయక్ సుండుపల్లె తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయి చాలా రోజులైందని, వెంటనే పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రహదారి అక్కడక్కడ గుంతలమయమై ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. డబుల్ రోడ్డు పనులు చేపట్టకపోతే పెద్దఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ నాయక్, నాగన్న, రాజశేఖర్ నాయక్, అప్రోజ్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బంజారా నాయకులు

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

ఒంటిమిట్ట : నెల్లూరు జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ 27వ మహాసభలు ఫిబ్రవరి 3, 4, 5వ తేదీలలో జరుగుతున్న సందర్భంగా విజయవంతం చేయాలని మండల సీపీఐ కార్యదర్శి నరసయ్య కోరారు. సోమవారం నుంచి జరిగే ఈ రాష్ట్ర మహాసభల కరపత్రాలను గురువారం ఒంటిమిట్ట మండల కేంద్రంలో వారు విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు రాము, హరి, వెంకటేష్, లక్ష్మీనారాయణ, అమ్ములమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నేడు అమ్మవారి ఆత్మార్పణ దినం

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటలో కొలువైన శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరీదేవి అమ్మవారిశాలలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఏటా మాఘు శుద్ధ విదియ రోజున అమ్మవారి ఆత్మర్పణ దినంగా చేసుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేయనున్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రుల వ్వాలని ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు.

ఘనంగా గాంధీ వర్ధంతి

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి, అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మహాత్మ గాంధీ, అమరవీరులు భగత్ సింగ్ తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ సత్యాగ్రహమే ఆయుధంగా స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్ముడని కొనియాడారు. అలాగే దేశస్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయులు సుఖదేవ్, రాజ్ గురు, భగత్‌సింగ్‌లు అని వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

ముగిసిన వాలీబాల్ టోర్నీ

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న బాస్ వాలీబాల్ టోర్నీ ముగిసింది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్ గాలివీడు, లక్కిరెడ్డిపల్లి జట్ల మధ్య జరిగింది. ఈ పోటీలో గాలివీడు జట్టు విజయం సాధించింది. విజేతలకు నిర్వాహకులకు రూ.25 వేలు, ట్రోఫీని అందజేశారు. రన్నర్స్‌కు రూ.15 వేలు అందజేశారు. ఎస్ఐ డి.రవీంద్ర ఆయా జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ షేక్ ఆరీఫ్, షేక్ నసిరుద్దీన్, జేకే టైలర్ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.


పోలీసు డైరీ ఆవిష్కరణ

సిద్ధవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసు డైరీ 2025ను గురువారం ఇన్‌చార్జి కమాండెంట్ నాగేశ్వరప్ప ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. బెటాలియన్ పోలీసు అసోసియేషన్ తరపున ఈ పోలీసు డైరీ 2025 ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు పోలీసు అసోసియేషన్ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


డైరీను ఆవిష్కరించిన ఇన్‌చార్జ్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అధికారులు

నివాళి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ తూర్పుపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పంజం విజయ్‌కుమార్ రెడ్డి పెద్దకర్మకు రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తరపున మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు.


నివాళి అర్పిస్తున్న కొరముట్ల, నేతలు

పశు ఆరోగ్య శిబిరం


పశువులకు నట్టల నివారణ మందును తాపుతున్న డాక్టర్ మాలకొండయ్య

రాయచోటి జగదాంబసెంటర్ : రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ రాయచోటి ఉపసంచాలకులు డా.మాలకొండయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని దిగువగొట్టివీడు రైతు సేవా కేంద్రం పరిధిలోని దిగువగొట్టివీడు, జంగంపల్లె గ్రామాలలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పశువులకు, దూడలకు, గొర్రెలు, మేకలకు చిన్నమండెం పశు వైద్యాధికారి డా.గణేష్ నట్టల నివారణ మందులను తాపించారు. రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు.

క్లుప్తంగా

ఆర్‌బీకే తనిఖీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని జేడీఏ చంద్రానాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ కిషోర్ నాయక్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం రికార్డులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణంలోని యూసుఫ్ షా ఖాద్రీ నగర్‌లో వెలసిన హసన్ దాదా షావలీ సాహెబ్ బాబా దర్గా ఉరుసు ఉత్సవాలు నేటి నుంచి జరగనున్నట్లు గురువారం దర్గా కమిటీ చైర్మన్ మహబూబ్ వలీ కుమారుడు ఎస్.మహమ్మద్ షరీఫ్, వైస్ చైర్మన్ అన్నయ్య, సెక్రటరీ హైదర్, జనరల్ సెక్రటరీ ఆబిద్‌లు తెలిపారు. ఈ నెల 31న గంధం, ఫిబ్రవరి 1వ తేదీన ఉరుసు ఉంటుందన్నారు. రాత్రి ఖవ్వాలీ కార్యక్రమం ఉంటుందన్నారు.

సబ్‌జైలు తనిఖీ

రాజంపేట : రాజంపేట సబ్‌జైలును గురువారం సీనియర్ సివిల్ జడ్జి, కడప న్యాయ సేవాధికార సంస్థ గౌరవ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. జైలులో ఖైదీల హక్కులు, ఉచిత న్యాయసాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు.

సీసీ రోడ్డు వేయాలంటూ వినతి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ఉంగరాల నగర్‌లో సీసీ రోడ్డు వేయాలని మహిళలు ఈఓ ప్రసాద్ రావుకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు లేకపోవడం వలన పారిశుద్ధ్యం కుంటుపడుతోందని వర్షపునీరు నిలుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. త్వరితగతిన సీసీరోడ్డు నిర్మించాలని విన్నవించారు.

బాధ్యతల స్వీకరణ

సిద్ధవటం : ఎంఈఓ గా పద్మజ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఓబులవారిపల్లె ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న పద్మజ బదిలీపై సిద్ధవటం ఎంఈఓ–1గా వచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.